ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 29-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ఏకీకృత దేశాన్ని ఏర్పాటు చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.
- మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈరోజుతో ముగిసింది.
- జాతీయ భద్రతా దృష్ట్యా భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో ఈరోజు రోజ్‌గార్ మేళా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ సంస్థల్లో కొత్తగా నియమితులైన యువకులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో 51 వేలకు పైగా నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. (వాయిస్ బైట్.. ప్రధాన మంత్రి)..

(వాయిస్ 34 సెకన్లు)

కాగా ఈరోజు వేరు వేరు ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన వారికి కర్మయోగి పోర్టల్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కర్మయోగి పోర్టల్‌లో 1400 ఇ-లెర్నింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏకీకృత దేశాన్ని ఏర్పాటు చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈరోజు ఉదయం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనిటీ రన్ అనేది దేశ ఐక్యతకు సంబంధించిన తీర్మానం మాత్రమే కాదని, ఇప్పుడు ఐక్యతా పరుగు వికసిత భారత్‌కు తీర్మానంగా మారిందని పేర్కొంటూ.... (వాయిస్ బైట్.. అమిత్ షా)..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో దాదాపు 12 వేల 850 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన ఆరోగ్య కవరేజీ విస్తరణను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించారు. భారతదేశపు మొదటి ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండవ దశను కూడా ఆయన ప్రారంభించారు. ఇందులో పంచకర్మ ఆసుపత్రి, ఔషధాల తయారీకి ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని మూడు వైద్య కళాశాలలను కూడా ఆయన ప్రారంభించారు. అంతకముందు ధనతేరస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ధన్వంతరి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితం ఎల్లప్పుడూ మంచి ఆరోగ్యం, ఆనందం శ్రేయస్సుతో నిండి ఉండాలని సామాజిక మాధ్యమం వేదికగా ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ అఖ్నూర్ సెక్టార్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ లో ఈరోజు మరో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. నిన్నటి నుండి కొనసాగుతున్న కాల్పుల్లో మరణించిన ఉగ్రవాదుల సంఖ్య మూడుకు

చేరుకుంది. నిన్న ఉదయం LOC సమీపంలో ఆర్మీ కాన్వాయ్‌తో పాటు అంబులెన్స్‌పై దాడిలో ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొన్నారు. ప్రత్యేక బలగాలు, NSG కమాండోలు జరిపిన ఆపరేషన్‌లో నిన్న సాయంత్రం ఉగ్రవాదుల్లో ఒకరు మరణించగా ఆర్మీ, పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో ఈరోజు మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈరోజుతో ముగిసింది. రేపు నామినేషన్ పత్రాల పరిశీలన జరుగనుండగా అభ్యర్థుల ఉపసంహరణకు నవంబర్ 4 చివరి తేది. అలాగే జార్ఖండ్ అసెంబ్లి రెండవ దశ ఎన్నికల్లో భాగంగా ముప్పై ఎనిమిది నియోజకవర్గాలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ కూడా ఈరోజుతో ముగిసింది. అభ్యర్థులు నవంబర్ 1 వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. రెండు రాష్ట్రాల్లోనూ వచ్చే నెల 20న పోలింగ్ జరగనుంది.

==============================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రత దృష్ట్యా భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూ ఢిల్లీలో భారత నౌకాదళం ఏర్పాటు చేసిన స్వావలంబన్-2024 కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. స్వావలంబన దిశగా భారత నౌకాదళం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. గతంలో భారత రక్షణ రంగం ఎక్కువగా దిగుమతులపై ఆధార పడవలసి వచ్చేదని, కానీ గత కొన్నేళ్లుగా రక్షణ రంగానికి సంబంధించి భారత్ లో వినూత్నమైన అభివృద్ధి చోటు చేసుకుంటుందని, ప్రభుత్వ రంగం ఇప్పటికే రక్షణ రంగంలో స్వావలంబన సాధించిందని అన్నారు. రక్షణ పారిశ్రామిక వ్యవస్థను, ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేస్తున్నామని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ .... (వాయిస్ బైట్.. రాజ్ నాథ్ సింగ్ )..

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రతను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి సమీకృత ప్రభుత్వం విధానం అవసరమని విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఆర్మీ కమాండర్ల రెండవ దశ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశంపై ప్రభావం చూపే సంక్లిష్టమైన ప్రపంచ, భౌగోళిక సమస్యలను ఆయన ప్రస్తావించారు. ప్రస్తుత ప్రపంచ క్రమంలో వైరుధ్యాలు, సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన సంసిద్ధతను, ప్రపంచ సంఘర్షణల నుండి నేర్చుకున్న పాఠాలను ఆయన వ్యాఖ్యానించారు. కాగా రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో భారత సైన్యం యొక్క సీనియర్ నాయకత్వం, సరిహద్దు భద్రత, లోతట్టు ప్రాంతాలు రెండింటినీ ప్రభావితం చేసే క్లిష్టమైన వ్యూహాత్మక సమస్యలపై చర్చించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ నగరంలో అన్ని రకాల పటాకుల తయారీ, క్రయ విక్రయాలు, పేల్చడాన్ని నిషేధించింది. వాయు నాణ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఢిల్లీ దాని పరిసర ప్రాంతాలలో అధికారులు వాయు కాలుష్యాన్ని తనిఖీ చేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా పంజాబ్ రాష్ట్రాలు యాంత్రీకరించిన స్వీపింగ్‌ను మెరుగుపరచడం, పొగమంచు నిరోధక చర్యలను అమలు చేయడం మరియు పటాకుల నిషేధాన్ని అమలు చేయడం లాంటి ఆదేశాలను ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్ కమిషన్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,037 పాయింట్ల వద్ద ప్రారంభమై 80,369 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 127 పాయింట్లు పెరిగి 24,466 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా బంగారం ఔన్సు 2,763 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న చివరి వన్డేలో మొదట బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 233 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య చేదనలో భారత్ ఇప్పటివరకూ 2 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. విజయానికి 60 బంతుల్లో మరో 25 పరుగులు చెయ్యాలి. మూడు మ్యాచ్‌ల

సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది. సిరీస్‌లోని ఓపెనింగ్ మ్యాచ్‌ను న్యూజిలాండ్ మహిళలు కైవసం చేసుకోగా, రెండో మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. ఈ మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =